# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 01 సంచిక - 356 పేజీలు - 6 శుక్రవారం 15 నవంబర్ 2024


## నిజామాబాద్‌లో ఫ్లెక్సీ వివాదం

● ఆర్మూర్‌లో ఉద్రిక్తత

తొలి అక్షరం/నిజామాబాద్, నవంబర్ 14 :

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మధ్య వివాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటిస్తున్నారు. అయితే ఆర్మూర్‌లో మంత్రి జూపల్లి పర్యటన సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి కారణమైంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఫొటోలు లేకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఇరువర్గాలను శాంతింపజేశారు.



● గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి ● విద్యాశాఖకు బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు ● రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి బాలల దినోత్సవం ● హాస్టళ్లలో ఫుడ్‌పాయిజనింగ్ జరిగితే చర్యలు

● ఎల్బీ స్టేడియంలో బాలల దినోత్సవంలో సిఎం రేవంత్


## రూ.5వేల కోట్లతో
# ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్14:** రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించామని సీఎం తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత అని,. నవీన భారత రూపశిల్పి నెహ్రూ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే

వివరాలు 2లో

## జార్ఖండ్‌లో బిజెపిదే
# అధికారం

సోరెన్ ఇంటికి వెళ్లడం ఖాయమన్న అమిత్ షా



**తొలి అక్షరం/రాంచీ,నవంబర్14:** ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్ సర్కారుకు ఓటమి తప్పదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇక్కడ బిజెపి కూటమి గెలవడం ఖాయమని అన్నారు. ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని కోరకుంటున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నవంబర్ 23 రోజే సీఎం హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి వీడ్కోలు అన్నారు. ఝార్ఖండ్‌లో మలివిడత ఎన్నికల ప్రచారం సందర్భంగా డుమ్రిలో ఏర్పాటు

వివరాలు 2లో




## తాను ఎలాంటి వాగ్మూలం ఇవ్వలేదు

- హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన పట్నం

## హైకోర్టును తప్పుదోవ పట్టిస్తున్న
# సిఎం రేవంత్

● ఫార్మా భూమి అని చెప్పి ..ఫోర్త్ సిటీ కోసం యత్నం ● లగచర్ల ఘటనతో రైతుల ఆగ్రహం బయటపడింది ● మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్14:** తెలంగాణ హైకోర్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో భూముల ధరలు తగ్గాయని చెప్పారు. కాంగ్రెస్ మిగతా నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. లగచర్లలో ఉంది ఫార్మా భూమి అని హైకోర్టు కోర్ట్‌కు సీఎం రేవంత్ అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. బయటకు వచ్చి ఫోర్త్ సిటీ

వివరాలు 2లో

## తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా
# కాంగ్రెస్, బీఆర్ఎస్

● ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రెండు పార్టీలు

● బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం దుర్మార్గం ● ప్రధానికి స్వాగతం పలకని వారు మాకు పాఠాలు చెబుతారా ● మీడియా సమావేశంలో మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




## అధికారం కోల్పోవడంతో రెచ్చగొట్టే
# యత్నాలు



● ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో బిఆర్ఎస్ నేతలు ● డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క విమర్శలు

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్14:** అధికారం కోల్పోయిన భారాస నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మండిపడ్డారు. లగచర్ల ఘటనతో వారి కుట్రలు బట్టబయలు అయ్యాయని అన్నారు. అధికారం లేకపోవడంతో తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు.ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడం పైనే ఆ పార్టీ దృష్టి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్ చెప్పాలని భట్టి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో భట్టి మాట్లాడారు. 'నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా అని నిలదీసారు. రైతు రుణమాఫీ చేయడం వైఫల్యమా అని నిలదీసారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడం ప్రభుత్వ వైఫల్యమా? ఫార్మా క్లస్టర్స్ విస్తరణను వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని అన్నారు. కక్షపూరిత రాజకీయాలకు మేం వ్యతిరేకం అన్నారు. ప్రతిపక్షంగా భారాస తన పాత్ర పోషించిందా చెప్పాలని నిలదీశారు. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. దాని ప్రకారం చేసి చూపిస్తున్నాం. ఇది విప్లవాత్మక నిర్ణయం..

వివరాలు 2లో

## మరోసారి విచారణకు రేవంత్‌రెడ్డి గైర్హాజరు

- వచ్చే నెల 16కు వాయిదా



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్14:** ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మరోసారి విచారణకు గైర్హాజరయ్యారు. దీంతో వచ్చే నెల 16ను కేసు విచారణ వాయిదా పడింది. గురువారం విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది. విచారణకు సండ్ర వెంకట వీరయ్య, ఉదయ్ సింహా, మత్తయ్య, సెబాస్టియన్ హాజరు కాగా, సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్ గైర్హాజరయ్యారు. కాగా, గత నెల 16న జడ్జి లీవ్‌లో ఉండటంతో కోర్టు కేసును నేటికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

వివరాలు 2లో




## ప్రభుత్వంపై వ్యతిరేకత కొడంగల్ నుంచే ప్రారంభమైంది

● ఇలా ఎన్ని రోజులు అరెస్టు చేయిస్తాడో మేమూ చూస్తాం

● కాంగ్రెస్‌కు ఓటేసినందుకు భూములు గుంజుకుంటావా..?

● మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

## గ్రూప్-4 ఫలితాలు విడుదల

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్14:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. 2022 డిసెంబర్ 1న ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా 8,180 పోస్టులకు గాను 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. పలు దఫాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఫలితాలు వెల్లడించింది. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**తొలి అక్షరం/సంగారెడ్డి,నవంబర్14:** సంగారెడ్డి జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. నారాయణ్‌ఖేడ్‌లోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని.. వసతి గృహం పైనుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన హాస్టల్ సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.


## జార్ఖండ్‌లో బిజెపిదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన సభలో అమిత్ షా ప్రసంగించారు. అధికార దురాశ వల్లే ఝార్ఖండ్ ఏర్పాటును వ్యతిరేకించిన ఆర్జేడీ -కాంగ్రెస్ ఒడిలో హేమంత్ సోరెన్ కూర్చోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న అమిత్ షా.. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారన్నారు. ఝార్ఖండ్‌లో చొరబాట్లను హేమంత్ సర్కార్ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే చొరబాటుదారులను బహిష్కరిస్తామన్నారు. అనేక పరిశ్రమలు నెలకొల్పి.. ఒక్క యువకుడు కూడా వలస వెళ్లకుండా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హేమంత్ సోరెన్ గతంలో నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని సైతం నెరవేర్చలేదన్నారు. భాజపా అధికారంలోకి వస్తే.. యువతకు నెలకు రూ.2వేలు నిరుద్యోగ భృతి కల్పించడంతో పాటు 2లక్షలకు పైగా ఖాళీ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

## తాను ఎలాంటి వాగ్మూలం ఇవ్వలేదు

### హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన పట్నం



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్14:** తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ లగచర్ల ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ప్రభుత్వాధికారులపై దాడి కేసులో చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్ రెడ్డిని గురువారం న్యాయవాదులు కలిశారు. వారి ద్వారా కోర్టుకు నరేందరెడ్డి అఫిడవిట్ పంపించారు. నేను పోలీసులకు ఎలాంటి వాగ్మూలం ఇవ్వలేదు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు చెప్పినవన్నీ నిజం కాదు. నా స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకొని విచారణ చేయాలి‘ అని కోర్టుకు పంపించిన అఫిడవిట్‌లో నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కేబీఆర్ పార్క్ వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో తనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా కారులో ఎక్కించి వికారాబాద్ డీటీసీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో పోలీసులు నా స్టేట్‌మెంట్ తీసుకోలేదు. కోర్టులో హాజరుపరిచే 10 నిమిషాల ముందు కొన్ని పేపర్లపై నా సంతకాలు తీసుకున్నారు. నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారు. అరెస్టుకి ముందు నాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. కేటీఆర్ సహా ఇతర ముఖ్యనేతల అదేశాలతో దాడులు చేయించినట్లు పోలీసులు కట్టుకథ చెప్పారు. మరో వైపు నరేందర్‌రెడ్డిని 7 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది.

## అధికారం కోల్పోవడంతో రెచ్చగొట్టే యత్నాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుంది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే ప్రశ్నలు తయారు చేశాం అని భట్టి విక్రమార్క అన్నారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన లింగంపేట ఎస్ఐ

**తొలి అక్షరం/కామారెడ్డి, నవంబర్ 14 :** కామారెడ్డి జిల్లా లింగంపేట ఎస్ఐ అరుణ్, రైటర్ రామస్వామి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డారు. ఒక కేసు విషయంలో ఎస్ఐ డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు తెలిసింది. వారి సూచనలు మేరకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, నాలుగు రోజుల క్రితమే నిజామాబాద్ జిల్లా వర్ని ఎస్ఐ ఏసీబీకి చిక్కగా..వారం తిరగకముందే మరో ఎస్ఐ ఏసీబీకి పట్టుబడటం జిల్లాలో చర్చనీయాంశమైంది. మరోవైపు జిల్లాలో ఏసీబీ వరుస దాడులతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం అన్నారు. అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు చూశారా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలని సీఎం కోరారు. ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాల్లో ఇటీవల జరుగుతోన్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు తినే ఆహారంలో కల్తీ జరుగుతోంది. విద్యార్థులు తినే భోజనంలో పురుగులు, బల్లులు వస్తున్నాయి. ఇక నుండి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టకపోతే జైలుకు పంపుతాం. విద్యార్థులకు గ్రీన్ ఛానెల్ ద్వారా కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలి. విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి ఆహారం పెట్టాలి. ముఖ్యమంత్రి, మంత్రులు తినే సన్న బియ్యమే గురుకులాల విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. ఎక్కడైనా విద్యార్థులకు దొడ్డ బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకోం' అని సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని.. ఈ విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్ అన్నారు. ఇందులోనే కాబోయే ఇంజనీర్లు, డాక్టర్లు, ముఖ్యమంత్రులు ఉన్నారన్నారు. ఈ వేదికగా మీ కళల్ని ప్రదర్శించే అవకాశం నాడు ఇచ్చారా..? కానీ మీ రేవంత్ అన్న మిమ్మల్ని కలుసుకున్నాడు.. మీతో ఉన్నాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు వినపడేలా విద్యార్థులు చప్పట్లు కొట్టాలని ఈ సందర్భంగా స్టూడెంట్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పండగ పేరుతో సారా బుడ్లతో దొరికిన వారికి శిక్ష తప్పదని పరోక్షంగా కేటీఆర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టును తప్పదోవ పట్టిస్తున్న సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

అంటున్నారని కేటీఆర్ విమర్శించారు.తెలంగాణ భవన్‌లో గురువారంమీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ భవన్‌కు లగచర్ల భూసేకరణ గిరిజన కుటుంబాలు చేరుకున్నాయి. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉంటానని కేటీఆర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి సీట్ కోసం మంత్రులు ఎదురుచూస్తున్నారని కేటీఆర్ విమర్శలు చేశారు.నల్గొండ ,ఖమ్మం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , మల్లు భట్టి విక్రమార్క సీఎం చైర్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ముందుగా తన సీట్ పోకుండా రేవంత్ రెడ్డి చూసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో భూముల ధరలు పెరిగాయని అన్నారు. ఏమైనా అభివృద్ధి చేస్తారేమోనని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. 'లగుచర్ల ఇష్యూతో సర్కారు బంగపడింది. లగచర్లలో అరెస్టు అయిన వారిని పోలీసులు తీవ్రంగా కొట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి పెట్టి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారు . పోలీసులు ఘోరంగా ప్రవర్తిస్తున్నారు. మా నాయకుడు సురేష్ తప్పేం చేశారు. నరేందర్ రెడ్డిని ఎందుకు అరెస్టు చేశారు. నాలుగేళ్లలో మేమే అధికారంలోకి వస్తాం. ఆంధ్రలో ఏం జరిగిందో తెలంగాణలో అదే జరుగుతది. బీఆర్ఎస్ నేతలపై బోగస్ కేసులు పెడుతున్నారు. అధికారులకు అంత స్వామి భక్తి పనికి రాదు. రేవంత్ పిచ్చోడు.. అసలు వదలం. బాధితులను ఢిల్లీకి తీసుకెళ్తాం. నేషనల్ హెచ్ఆర్సీలో ఫిర్యాదు చేస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్

- ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న రెండు పార్టీలు
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం దుర్మార్గం
- ప్రధానికి స్వాగతం పలకని వారు మాకు పాఠాలు చెబుతారా
- మీడియా సమావేశంలో మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్14:** తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ తదితరులపై మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉండగా ప్రధాన మంత్రి రాష్ట్రానికి వస్తే స్వాగతం పలకలేని మొఖాలు ఇవాళ మేమేం చేయాలో చెప్తయా.. అని కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ సర్టిఫికేట్ మాకు అక్కర్లేదని అన్నారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేస్తోందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని... గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుందని ఈ క్రమంలో కొంత జాప్యం జరిగితే తొందరపాటుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, అంతమాత్రాన బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే చెప్పడం అవివేకమని కిషన్ రెడ్డి అన్నారు. అవినీతి ఎక్కడ జరిగినా విచారణ జరపాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని, సీఎం రేవంత్ రెడ్డి విచారణ కోరారా.. అని ప్రశ్నించారు. గవర్నర్ నిర్ణయం తీసుకోవాలంటే లీగల్ ఒపీనియన్ అనేది ఉంటుందని చెప్పారు. అమృత్ టెండర్లపై జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ తామే కోర్టుకు వెళ్లామని గుర్తు చేశారు. ప్రజలతో తప్ప ఏ పార్టీతో బీజేపీ ములాఖత్ కాలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీరియస్ అయ్యారు.వైఫల్యాలను, అసమర్థత నుంచి దృష్టి మళ్లించేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని, కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి ప్రాజెక్టులు ప్రారంభించడానికి వస్తే బయటకు రాని కేసీఆర్, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. కలెక్టర్ మీద దాడి తప్పు అని.. కానీ గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడం కూడా సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటన అని, ఆయన తన ప్రజలతో మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని, ఒక్క అవినీతి, కుంభకోణం ఆరోపణ లేకుండా బీజేపీ, శివసేన ప్రభుత్వ పాలన సాగిందని కిషన్ రెడ్డి అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో బొగ్గు శాఖ, గనుల శాఖ విడివిడిగా పెవిలియన్లు ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారని, ఇది ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. బొగ్గు వెలికితీత ముగిసిన తర్వాత ఆ గనులను పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడేలా ఎలా తీర్చిదిద్దాలి అన్న విషయంపై పనిచేస్తున్నామని చెప్పారు. బొగ్గు పరిశ్రమలో



ప్రమాదాలు లేకుండా కార్మికుల క్షేమమే ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు కోల్ ఇండియా ఫౌండేషన్ డే ఉత్సవాలు నిర్వహిస్తామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ అవసరాలకు 95 శాతం రాగి దిగుమతులు చేసుకుంటున్నామని, నిత్యజీవితంలో కాపర్ వినియోగం ఉంటుందని కిషన్ రెడ్డి తెలిపారు. కాపర్ సహా అనేక ఖనిజాలు, ధాతువులు, క్రిటికల్ మినరల్స్ విషయంలో ఆత్మనిర్భర్, స్వయం సమృద్ధి సాధించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. క్రిటికల్ మినరల్స్‌లో లిథియం ఒకటని.. దాన్ని వెలికితీయడం కష్టతరమైన పక్రియ అని పేర్కొన్నారు. ఈ క్రమంలో కాబిల్ సంస్థను ఏర్పాటు చేశామని, ఇది వివిధ దేశాలు సందర్శించి లిథియం నిక్షేపాల వెలికితీత గురించి తెలుసుకుంటుందన్నారు. సముద్రగర్భంలో ఉన్న ఖనిజాల వెలికితీత గురించి వేలం పక్రియ నిర్వహిస్తామని, లిథియం విషయంలో ఆస్ట్రేలియా, అమెరికా, అరబ్ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని కిషన్ రెడ్డి తెలిపారు.

## మరోసారి విచారణకు రేవంత్‌రెడ్డి గైర్హాజరు

(మొదటి పేజీ తరువాయి)



2015 మే 31న ఓటుకు నోటు కేసులో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరో ఎమ్మెల్యే స్టిఫెన్‌సన్‌కు నోట్ల కట్టలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినట్టు అభియోగాలున్నాయి. దీనిపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రేవంత్‌రెడ్డితోపాటు సెబాస్టియన్, ఉదయ్‌సింహ, సండ్ర వెంకట వీరయ్యతోపాటు రూ.50 లక్షలు సమకూర్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వేం కృష్ణకీర్తన్ తదితరులపై కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే ఓటుకు నోటు కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు గుర్తించిన ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నాంపల్లిలోని ఈడీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఈడీ కోర్టు విచారణకు నిందితులు కొంతకాలంగా హాజరు కావడం లేదు.ముఖ్యమంత్రి కావడంతో మిగతా నిందితులు సైతం కోర్టుకు హాజరుకాకుండా, గైర్హాజరీ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీనిని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. నిందితులు కోర్టుకు హాజరుకాకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ మండిపడింది. మరోవైపు, ఏసీబీ నమోదుచేసిన ఓటుకు నోటు కేసు విచారణ కూడా నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో కొనసాగుతున్నది. ఈ కేసులో ఏ-1 నిందితుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

## ప్రభుత్వంపై వ్యతిరేకత కొడంగల్ నుంచే ప్రారంభమైంది

- ఇలా ఎన్ని రోజులు అరెస్టు చేయిస్తాడో మేమూ చూస్తాం
- కాంగ్రెస్‌కు ఓటేసినందుకు భూములు గుంజుకుంటావా..?
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్14:** ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ఇప్పుడు అనుభవిస్తున్నారని, రైతుల నుంచి బలవంతంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి భూములు గుంజుకుంటున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని హరీశ్‌రావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ పగ ప్రతీకారంతో పట్నంను కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని ఆరోపించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలన మీద తిరుగుబాటు మొదలైందని.. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మీకు ఓటేస్తే మేలు జరుగుతుందనుకుంటే పాపానికి.. లగచర్ల గ్రామం భూములను గుంజుకోవడమే నువ్వు చేసే మేలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఎక్కడ ఏం జరిగినా బీఆర్ఎస్‌పై పెడుతున్నారన్నారు. నిరుద్యోగులు, రైతులు, పోలీసులు స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని.. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడడం ప్రతిపక్షాలుగా మా బాధ్యత అన్నారు. మమ్మల్ని అక్రమంగా కేసులు పెట్టాలనుకుంటున్నావేమో .. మాపై కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయండి.. కానీ అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారని సీఎంని ప్రశ్నించారు. వెంటనే గిరిజన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా ..? ప్రజాస్వామ్యమెక్కడుంది అంటూ నిలదీశారు.మల్లన్నసాగర్‌లో రేవంత్ రెండురోజులు నిరసన చేస్తే మేం అడ్డుకున్నమా.. ? అని ప్రశ్నించారు. అర్ధరాత్రి మహిళల చాతిమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ ప్రజల తిరుగుబాటు ఆగదని.. రేవంత్‌ని గద్దె దించే దాకా నిద్రపోమన్నారు. మా ప్రభుత్వంలో 14వేల ఎకరాలు ఫార్మాసిటీ కోసం సేకరించామని.. అక్కడెందుకు ఫార్మాసిటీ కట్టరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ముసుగులో దళితుల, గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన ఇప్పుడు కనిపిస్తోందన్నారు. రైతుల భూములు గుంజుకోవడమే ఇందిరమ్మ పాలన అని నిలదీశారు. రేవంత్ పాలన అదానీ, తమ్ముళ్లు, అల్లుళ్ల కోసమేనని.. బీఆర్ఎస్ పార్టీ దళిత, గిరిజనుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. కేటీఆర్‌పై సైతం కుట్రలు చేస్తున్నారని.. ఆ రోజు మల్లన్నసాగర్‌లో నీ మీద కేసులు పెట్టినమా అంటూ సీఎం రేవంత్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించామని.. నరేందర్ రెడ్డికి ఏ సంబంధం లేదన్నారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో తెలియదని.. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి ఒక్క నిముషం ముందు ఒత్తిడి చేసి నరేందర్‌రెడ్డితో సంతకం చేయించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి బడాబాబులపై ప్రేమ ఉందన్నారు. నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని.. ఆయనకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. ధర్మమే గెలుస్తుందని.. న్యాయస్థానంలో తమకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారన్నారు.

# జాతీయస్థాయి క్రీడలలో విజయం సాధించిన విజేతలను అభినందించిన డాక్టర్ తిరుపతిరెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి(సాంబ) నవంబర్ 14:** అయినవోలు మండలం ఖమ్మం హైవేలోని ఏకశిల సిబిఎస్ఇ అండ్ స్టేట్ స్కూల్ విద్యార్థులు క్రీడ విభాగాలలో రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న మరియు విజయం సాధించిన విద్యార్థులను డాక్టర్ శ్రీ తిరుపతిరెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికాలతో పాటు సర్టిఫికెట్ తో సన్మానించారు.జాతీయస్థాయి క్రీడలలో ఏకశిల ఆణిముత్యాలు విజయం సాధించిన విజేతలను అభినందించిన ఏకశిల విద్య సంస్థల చైర్మన్ డాక్టర్ శ్రీ తిరుపతిరెడ్డి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏకశిల విద్య సంస్థల చైర్మన్ డాక్టర్ శ్రీ తిరుపతిరెడ్డి పాల్గొని అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుతో పాటు విద్యార్థుల ఆల్ రౌండ్ డెవలప్మెంట్ లక్ష్యంగా ఏకశిల విద్య సంస్థలు పని చేస్తున్నాయన్నారు ఆ తర్వాత స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జిఎఫ్ఐ) వారు నిర్వహించిన ఫుట్ బాల్ హాండ్ బాల్ హాకీ చెస్ బాల్ బాల్ బ్యాడ్మింటస్ కరాటే రెజ్లింగ్ నెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఒలింపిక్ అసోసియేషన్ మినిస్టర్ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నెట్ బాల్ క్రీడల్లో జాతీయస్థాయిలో ఎంపికైన 9 వ తరగతి చెందిన జి నాగరాజుని మెమెంటో సర్టిఫికెట్ ఇచ్చి దుశాలువాతో ఘనంగా అభినందించి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ ఎండి బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవి కిరణ్, స్టాఫ్ ఈస్ చార్జీలు, పి ఈ టి లు నరసయ్య, నరేష్, రవీందర్, మనోజ్, రాజేష్, రజినీకాంర్, ప్రేమ్, సుభాష్, కళ్యాణి, రజిత, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 14:** హామీల అమలులో రేవంత్ సర్కార్ వైఫల్యం .రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి అనేక హామీలు గ్యారంటీలు ఇచ్చి ఏడాది కావస్తున్నా ఈనాటికీ హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కారు పూర్తిగా వైఫల్యం చెందిందని,అతి కొద్ది కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకొని అభాసుపాలు అవుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం తొర్రూర్ లో స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన బీజేపీ సంస్థాగత పర్వం-వర్కషాప్ లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావొస్తున్నదని, బూత్ కమిటీల నియామకం త్వరగా పూర్తి చేసి అనంతరం మండల, జిల్లా అధ్యక్షుల నియామకం ఈనెలాఖరులో జరుగుతుంది అని తెలిపారు.ప్రజాస్వామ్య బద్దంగా,పార్టీ రాజ్యాంగానుసారంగా ప్రతీ మూడేళ్లకోసారి సంస్థాగతంగా ఎన్నికలు నిర్వహించడం బీజేపీ ఆనవాయితీ అని తెలిపారు.పార్టీ సంస్థాగత ఎన్నికలు ఈనెలాఖరులో ముగిసిన తర్వాత వచ్చే నెల ఒకటి నుంచి ఏడు వరకు రాష్ట్ర వ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ పాదయాత్రలు చేపట్టనుందని, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పై వ్యక్తమవుతున్న ప్రజా వ్యతిరేకతను అందిపుచ్చుకుని, ప్రజలకు రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీల అమలు కోసం క్షేత్ర స్థాయిలో పోరుబాట పట్టబోతుంది అని తెలిపారు.ఈ సమావేశంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, జిల్లా కార్యదర్శి రచ్చ కుమార్, జిల్లా, మండల, శక్తి కేంద్రం ఇంచార్జీలు మరియు వివిధ మోర్చాల బాధ్యులు బూత్ కమిటీ అధ్యక్షులు గట్టు రాంబాబు,కాగు నవీన్, మంగళపల్లి యాకయ్య, గడల శేఖర్,రాయపురం రాజకుమార్, విష్ణు వర్ధన్ చారి,విజయ్ కుమార్, చలపతి రాజ్, సంతోష్, శ్రీనాథ్, రవితేజ,భషీర్,శివ, సురేష్, భాస్కర్, శ్రీనివాస్ చారి,కడెం యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై అవగాహన ర్యాలీ

- ముఖ్య అతిథులుగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి స్థానిక ఎస్సై రాంజీ నాయక్





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 14:** బాలల దినోత్సవం సందర్భంగా శ్రీవాణి ఎడ్యుకేషనల్ సోషల్ సర్వీస్ సొసైటీ పినాకపాణి ఆధ్వర్యంలో మరియు లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో బాలల దినోత్సవ వారోత్సవాలలో బాగంగా గురువారం ఉదయం 6 గంటలకి తొర్రూర్ లోని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ దగ్గర నుండి గాంధీ బొమ్మ వరకు బాలల హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది.... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి ముఖ్యఅతిథిగా మరియు స్థానిక ఎస్సై రాంజీ నాయక్ అతిధులుగా పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా నాగవాణి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని బాల కార్మిక వ్యవస్థను,బాల్య వివాహాల వ్యవస్థను సమూలంగా కూకటివేళ్లతో నిర్మూలించాలని, బాలల హక్కులను కాపాడి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతూ రేపటి నవ సమాజ నిర్మాణానికి పిల్లలే ముఖ్యులు వారి హక్కుల పరిరక్షణను కాపాడాల్సిన బాధ్యత మన అందరికీ ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తొర్రూర్ టీచర్స్ లయన్స్ క్లబ్ , తొర్రూర్ లయన్స్ క్లబ్ ప్రసిడెంట్ లు సురేష్, నవీన్, సెక్రటరీ సురేష్, రమేష్, ట్రెజరర్ లు వెంకన్న, వార్డెన్ ముదురిమ, టీచర్ జనార్ధన్, యాకయ్య, రమేష్, కరాటే మాస్టర్ రాజ్ కుమార్, విద్యార్దినిలు విద్యార్థులు మ్నెదలగు వారు పాల్గొన్నారు

# తొర్రూర్ వికాస్ పాఠశాలలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 14:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో వికాస్ పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని గురువారం విద్యార్థులకి సెల్ఫ్ గవర్నమెంట్ డే ను నిర్వహించడం జరిగింది. ఇందులో విద్యార్థులు డీఈవో, ఎంఈఓ, ప్రిన్సిపల్, పిటిలు, ఇన్చార్జులు, ఉపాధ్యాయులుగా అనేక రకాల రోల్స్ పోషించి చాలా ఆనందానికి గురి అయ్యారు. అలాగే పాఠశాల నుంచి యశ్వంత్ ఎనిమిదో తరగతి విద్యార్థి వరల్డ్ కరాటే ఛాంపియన్షిప్ లో సిల్వర్ మెడల్ సాధించి ఉన్నతంగా నిలిచినందుకు పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థిని సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ. విద్యార్థులకు విద్యతో పాటు ఆహ్లాదకరమైన ఆనందదాయకమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వేణుమాధవ్, సాయిలు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డిజిటల్ మీడియా జర్నలిస్టుల ఆవిర్భావ సభను విజయవంతం చేయండి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 14:** మహబూబాబాద్ జిల్లా తోరూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక విశ్రాంతిభవనంలో డిజిటల్ మీడియా జాతీయ నాయకులు చందా శ్రీనివాస్ రావు,డిజిటల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ ల ఆధ్వర్యంలో మానుకోట డిజిటల్ మీడియా ఆవిర్భావ సభ, జెండా ఆవిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా డిజిటల్ మీడియా జాతీయ నాయకులు చందా శ్రీనివాస్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోకులు సంయుక్తంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులకు ఇప్పటివరకు తగిన న్యాయం జరగలేదని పేర్కొంటూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ డిఎంజెయ సెప్టెంబర్ 20, 2024న హనుమకొండలో పురుడు పోసుకుందని తెలుపుతూ ఈనెల 17న మానుకోట జిల్లాలో డిజిటల్ మీడియా ఆవిర్భావ సభ, జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ ఆవిర్భావ సభకు డిజిటల్ మీడియా జర్నలిస్టు మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజెహెచ్ -143 జిల్లా ఉపాధ్యక్షులు గజ్జల వినోద్ రెడ్డి, మీడియా ప్రతినిధులు యాకాంతం, మహమ్మద్ అమీర్, పెందోట కిషన్ రావు, యశ్వంత్, సైదులు తదితరులు పాల్గొన్నారు.


# వెల్లివిరిసిన మతసామరస్యం

- అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం యువకుడు....
- అన్నదాత సుఖీభవ" అంటూ నిండు మనస్సుతో ఆశీర్వదించిన అయప్ప స్వాములు...
- గత మూడేళ్లుగా ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో భిక్ష ఏర్పాటు చేస్తున్న ముస్లిం యువకుడు

**తొలి అక్షరం/ మహబూబాబాద్ నవంబర్ 14:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో మత సామరస్యం వెల్లివిరిసింది. హిందూ-ముస్లిం ఐక్యతకు అద్దం పట్టే ఘటన ఇది. ఓ ముస్లిం సోదరుడు.. అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించి,మత సామరస్యాన్ని చాటుకున్నాడు. మతాలు వేరైనా.. మనుషులంతా ఒక్కటే అనే భావనతో అన్నదానం చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా లో నీ కొత్తగూడ మండల కేంద్రంలో చోటుచేసుకొంది.మండల కేంద్రానికి చెందిన ఎస్.కె.సల్మాన్ పాషా అనే ముస్లిం యువకుడు గురువారం నాడు మండల కేంద్రంలో నీ గాంధీనగర్ లో ఉన్న అయ్యప్ప గురు స్వామి యాదగిరి గోవర్ధన్ కుటీరంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి స్వయంగా సల్మాన్ వడ్డించి మతసామరస్యాన్ని ఘనంగా చాటాడు..ప్రతి సంవత్సరం కార్తీక మాసంలోనే గత మూడేళ్లు నుండి అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నానని అదే విధంగా ఈ సంవత్సరం కూడా భిక్షను ఎర్పాటు చేసినట్లు సల్మాన్ తెలిపారు..భిక్ష ఏర్పాటు చేసిన సల్మాన్ ను గురు స్వామి యాదగిరి గోవర్ధన్ ఆధ్వర్యంలో లో అన్నదాత సుఖీభవ అంటూ నిండు మనస్సుతో సల్మాన్ ను ఆశీర్వదించారు... భగవంతుని దృష్టిలో అందరూ సమాన మేనని, హిందు, ముస్లింలు కలిసిమెలిసి మెలగాలన్నదే తన అభిమతమని.. అందుకే భిక్షను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ కుల, మతాలకు అతీతంగా ఉండాలని సల్మాన్ ఆకాంక్షించారు.తన మతంపై ప్రేమ ఉందని, అదే సమయంలో ఇతర మతాలపైనా గౌరవం ఉందని సల్మాన్ తెలిపారు.కులాలు, మతాల పేరుతో ఘర్షణకు దిగి మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్న ఈ సమాజంలో సల్మాన్ చేసిన ఈ పని మంచి సందేశాన్ని పంపింది. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా హిందువులు, ముస్లింల మధ్య సామరస్య సందేశాన్ని అందించిందిఅని పలువురు అభిప్రాయ పడ్డారు...ఈ కార్యక్రమంలో గురు స్వామి యాదగిరి గోవర్ధన్,వాసం వీరాస్వామి,యాదగిరి కిరణ్ కుమార్,మల్లెల వీరాస్వామి,వాట్టం సుదర్శన్,సురేష్,రాజన్న,తదితరులు పాల్గొన్నారు.



# ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డిని సన్మానించిన అమీజ్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 14:** తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఇటీవల నియమితులైన అనుమాండ్ల తిరుపతిరెడ్డిని పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిల వీరాభిమాని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీజ్,చర్లపాలెం గ్రామ మైనార్టీ సేల్ అధ్యక్షుడు మహమ్మద్ బషీరుద్దీన్ లు గురువారం ఆయన వారి పటాన్ని బహుకరించి శాలువా కప్పి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ఎక్కటి నాగిరెడ్డి, మండల నాయకులు అద్దాల నరేందర్ రెడ్డి, పి.రామచంద్రు,మహేష్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎద్దు మహేష్ తదితరులు పాల్గొన్నారు

# పదవ తరగతి పరీక్షలు 100% విద్యార్థులు సాధించాలి



**తొలి అక్షరం/నరసింహుల పేట, నవంబర్ 14:** మహబూబాబాద్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్ నరసింహుల పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని పి టి ఎం పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా ఆజాద్ చంద్రశేఖర్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సరైన రీతిలో చదువుకునేటట్లు ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా,డిసెంబర్ లో నిర్వహించనున్న ఎన్ ఏ ఎస్. పరీక్షలో విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చూపేటట్లు ఉపాధ్యాయులు ప్రతిరోజు ఎన్ ఏ ఎస్.పరీక్షకు సంబంధించిన పరీక్షా అంశాలను బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రామ్మోహన్ రావు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కోట గుళ్ళ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఆలయ శిల్ప సంపదను భావితరాలకు అందించాలి
- జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ కోడూరు నవీన్ కుమార్
- ఆలయం పేరుతో ముద్రించిన బ్యాగుల ఆవిష్కరణ

**తొలి అక్షరం/గణపురం,14:** కోటగుళ్ళు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ కోడూరు నవీన్ అన్నారు. కార్తిక మాస ఉత్సవాలలో భాగంగా ఆయన గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం పేరుతో ముద్రించిన బ్యాగులను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాకే తలమానికంగా ఉన్న కోటగుళ్ల ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ శిల్ప సంపదను భావితరాలకు అందించాలన్నారు. ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఆవిష్కరణ కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కోటగుళ్ల పరిరక్షణ కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.



## పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**• నేటి బాలలే రేపటి పౌరులు**



**తొలి అక్షరం/మరిపెడ, నవంబర్ 14:** మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని సీతారాంపురం పాఠశాల నందు బాలల దినోత్సవ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అర్జున్ నాయక్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని మన దేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా సేవలు అందించారని అన్నారు.బ్రిటిష్ పాలనలో చతికిలపడ్డ దేశాన్ని తనదైన దార్శనికత, ముందుచూపుతో పురోగతి దిశగా నడిపించారని 1889 నవంబర్ 14న పుట్టిన నెహ్రూకు పిల్లలన్నా,గులాబీలన్నా అమితమైన ప్రేమ అని అన్నారు.అందుకే భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటారని అన్నారు.నెహ్రూ ఎక్కడికెళ్లినా.. పిల్లలను వెతికి మరీ ఆప్యాయంగా పలకరించేవారు. వారికి కానుకలను ఇచ్చి ఉత్సాహపరిచేవారు. ప్రధాని కాకముందు స్వతంత్ర పోరాటంలో భాగంగా ఆయన పలుమార్లు జైలు జీవితం అనుభవించారు. పిల్లలంటే ఎంతో ఇష్టమైన నెహ్రూకు తన కుమార్తె ఇందిర అంటే ఎనలేని అభిమానం. అందుకే ఆయన జైలు గోడల మధ్య నుంచి ఆమెకు అనేక ఉత్తరాలు రాసేవారు.స్వతహాగా రచయిత అయిన నెహ్రూ తన కుమార్తెకు రాసిన ఉత్తరాల్లో బోలెడు మంచి సంగతులు చెప్పేవారు. పిల్లలు ఎలా ఉండాలి? ఎలాంటి విషయాలు నేర్చుకోవాలి? సమాజంలో మంచి, చెడులను ఎలా గ్రహించాలి? సమస్యలను ఎలా అధిగమించాలి తదితర అంశాలను కూలంకషంగా వివరించేవారు.నెహ్రూ నింపిన ఉత్సాహం, ధైర్యంతోనే ఇందిర 'ఉక్కు మహిళ'గా రూపొందారని,ప్రధానిగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని దేశాన్ని ముందుకు నడిపారు. తన కుమార్తె ఇందిరకు నెహ్రూ రాసిన ఉత్తరాలు నేటి తరానికి పాఠాలయ్యాయి. ఆయన చెప్పిన ఆ మంచి మాటలు మనం ఎప్పటికీ ఆచరించదగినవే అని అన్నారు.పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే వల్లమానిన ప్రేమ. ఆయణ్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచుకుంటారు.1964లో నెహ్రూ మరణించిన తర్వాత ఆయన పుట్టిన రోజును 'బాలల దినోత్సవం'గా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని అందుకే నాటి నుంచి నవంబర్ 14 ను బాలలే దినోత్సవంగా జరుపుకొంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుగులోతు మంగీలాల్,జి.కవిత,లింగాల మహేష్ గౌడ్, వెంకటేశ్వరరావు,సందీప్, ఆదిలక్ష్మి,సారిక విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంజీఎం హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**తొలి అక్షరం/గణపురం,14:** మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ లోని ఎంజీఎం హైస్కూల్ యందు భారత దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు నవంబర్ 14 గురువారం ఘనంగా నిర్వహించారు. పిల్లల పట్ల ఆయనకు ఉన్న అమితమైన ఇష్టం కారణం చేత దేశానికి ప్రధానిగా ఉన్నప్పటికీ ఎక్కడికి వెళ్లినా పిల్లలను ఆప్యాయంగా పలకరించే అతని స్వభావానికి గాను భారత ప్రభుత్వం 1954వ సంవత్సరం నుండి నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవం గా జరుపుతుంది.అందులో భాగంగా పాఠశాల విద్యార్థిని ,విద్యార్థులు కు క్రీడా పోటీలతో పాటు నృత్యాలు, నాటికలు, పాటలు, వక్తృత్వ వికాసం ,వ్యాసరచన పోటీలు మొదలగు కార్యక్రమాలు ప్రదర్శిస్తూ నెహ్రూ బోధనలను, దార్శనికథను ,ఉదాత్త భావాలను గుర్తు చేసుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా, జాతి సంపదలుగా,విరిసి విరియని కుసుమాలుగా ఉండి సరైన విద్యతో మాత్రమే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చు.కావున పిల్లలు తల్లిదండ్రుల కలల ప్రతిరూపాలు, వారికి విద్యతోపాటు మంచి విలువలను నేర్పుదాం అని తెలియజేస్తూ పిల్లలకు చాక్లెట్లు, స్వీట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్ ,ప్రిన్సిపల్ మధుకర్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం దొడ్డు రకం దాన్యం కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు పెట్టాలి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**తొలి అక్షరం/గణపురం, నవంబర్ 14:** కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం దొడ్డు రకం దాన్యం కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు పెట్టాలని కొనుగోలు చేసిన ధాన్యపు బస్తాలకు గుర్తింపు నకు అనువుగా రంగుతో గుర్తులు పెట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం మండలంలోని జంగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తూకపు పరికరాన్ని పరిశీలించారు.తూకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. తాలు లేకుండా శుభ్రపరిచిన ధాన్యాన్ని తీసుకురావాలని తేమశాతం 17% ఉంటే తక్షణమే కొనుగోలు చేసి ట్రక్ షీట్ జారీ చేయాలని ఇంఛార్జీలను ఆదేశించారు. కొనుగోలు జరిగిన ధాన్యం మిల్లులకు రవాణా చేయాల్సిన బాధ్యత కేంద్రాలు ఇన్చార్జిలదేనని ఆయన పేర్కొన్నారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏదేని తేడా వస్తే మీరే బాధ్యులు అవుతారని ఆయన పేర్కొన్నారు. కొనుగోలు చేసిన తర్వాత ధాన్యం తడిచినా, మిల్లర్లు మోసం చేసిన అందుకు బాధ్యత కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలే అవుతారని ఆయన పేర్కొన్నారు. తేడా రాకుండా చూడాల్సిన బాధ్యత మీదేనని ఆయన స్పష్టం చేశారు. తప్పు చేస్తే ఉపేక్షించలేదని రైతులు ఆరుకాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బంది రాకుండా తీకోవాల్సిన బాధ్యత మన మీద ఉందని ఆయన తెలిపారు. రవాణాలో జాప్యం చేస్తే ట్రాన్స్పోర్ట్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నిసంచులు, తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో సహకార అధికారి వాలియా నాయక్, ఎంపీడీవో భాస్కర్, పిఏసిఎస్ చైర్మన్ కన్నబోయిన కుమార్ యాదవ్,డైరెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల తొంబై మూడు వేల రూ.లు (1,28,93000/-) విలువైన గంజాయి దగ్ధం





**తొలి అక్షరం/మహబూబాబాద్ నవంబర్ 14:** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల తొంబై మూడు వేల రూపాయలు (1,28,93000/-) విలువైన గంజాయిని పోలీసులు దగ్ధం చేశారు.కాకతీయ మెడిక్లీన్ ఏజెన్సీ, ఊర్సుగుట్ట, హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ డ్రగ్ డిస్పోసల్ కమిటీ అధికారి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోసల్ కమిటీ సభ్యులు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నైయ్య, డిఎస్పీ తిరుపతి రావు సమక్షంలో 515 కేజీ 720 గ్రాముల గంజాయి దహనం చేశారు.మహబూబాబాద్ జిల్లా పోలీసులు జిల్లావ్యాప్తంగా గత కొంతకాలంగా నిర్వహించిన వివిధ దాడుల్లో పట్టుబడిన భారీ మొత్తంలో గురువారం ధ్వంసం చేశారు.కాలిపోయిన గంజాయి విలువ 1,28,93000/- ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లో నమోదు అయినా 24 కేసులలో మొత్తం 515kgs 730 గ్రామ్స్ గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌ను రవాణా చేసిన వారిపై కఠిన చర్యల తీసుకుంటామని తెలిపారు.గంజాయి దగ్ధం చేయు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డిఎస్పీ తిరుపతి రావు, సీఐ డి సి ఆర్ బి సత్యనారాయణ, సీఐ టౌన్ దేవేందర్, సీఐ డోర్నకల్ రాజేష్, సీఐ గూడూరు బాబు రావు, సీఐ బయ్యారం రవి పాల్గొన్నారు.

## " నేటి పాఠశాలలోని బాలలే రేపటి సమ సమాజ నిర్మాతలు "

**• పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్**





**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 14:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చంద్రుగొండ క్రాంతి హైస్కూల్లో జవహర్ లాల్ నెహ్రూ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది.స్వాతంత్ర భారతావనికి ప్రజాస్వామ్య ఊపిరిచ్చిన, మహనీయుడు దేశానికి దశ– దిశ చూపిన దార్శనికుడు , అలీనోద్యమ రూపశిల్పి, భారతదేశ తొలి ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా క్రాంతి హై స్కూల్ చంద్రుగొండ లో పాటల పోటీలు, ఉపన్యాస పోటీలు, చిత్రలేఖనం నిర్వహించడం జరిగింది. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థి,డి రామ్ చరణ్, ఎం, చందన, బి, సిద్ధార్థ, డి శ్రీజ, కే వైష్ణవి, ఈ,శ్రీజ జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలను స్మరించుకుంటూ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దపడతారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్ కొనియాడారు. అదేవిధంగా పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఏ, సదానందం , సిహెచ్,సూరయ్య బి,రమేష్ సిహెచ్ ,రాజమౌళి జి,సంపత్, పి,సుమన్, డి,శ్రీనివాస్, కే, సుధాకర్, ఈ,మాధవి, రవళి,సౌజన్య,రమాదేవి,శిల్పా, పద్మా మేడం లు పాల్గొన్నారు .


## నేటి విద్యార్థులే... రేపటి బాటసారిలు: ప్రిన్సిపల్ ల్యాదల్ల కృష్ణ

**• పాఠశాలలో స్వయం పరిపాలన, బాలల దినోత్సవ వేడుకలు**




**తొలి అక్షరం/గణపురం:** మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్లో జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం వేడుకలను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవ సందర్భంగా పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా ఉండడం వల్ల ఉపాధ్యాయుల బాధ్యతలు తెలుసుకున్నారు విద్యార్థులు సబ్జెక్ట్ ప్రిపేర్ ఐ పాఠాలను బోధించారు. అనంతరం బాలల దినోత్సవంలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ మాట్లాడుతూ... నేటి విద్యార్థులు రేపటి భవితకు బాటలు అని అలాగే విద్యార్థులు బాగా చదివి భారతదేశాన్ని ప్రపంచంలో అత్యున్నత దేశంగా మలిచే బాధ్యత మీదేనని మీరు బాగా చదివితే బంగారు భవితగా మనదే శాన్ని అగ్రగామిగా మార్చుతారని పిల్లలను ఉద్దేశించి స్పీచ్ ఇవ్వడం జరిగింది ఇప్పటికే మన దేశ ప్రతిభ ప్రపంచ నలుమూలల తాకిందని నేటి పిల్లలే రేపటి భావి భారత పౌరులని సమాజాన్ని సద్గు నా లతో నడిపించే బాధ్యత మీదేనని పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. స్వయం పరిపాలన దినోత్సవంలో డిఈఓగా పుట్ట సంజయ్, హెచ్ఎంగ టి సుశాంత్, పిఈటిగా సిహెచ్ గణేష్, సముద్ర సేన రెడ్డి, మిగిలిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెడ్ శివశంకర్ డైరెక్టర్లు ఎల్ యాదగిరి, జగన్, టీచర్స్ పాల్గొన్నారు.

## అత్యవసర అంబులెన్స్ 108 వాహనాల తనిఖీ



**తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 14:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని అత్యవసర అంబులెన్స్ 108 వాహనాల్లోని పరికరాలు మందులు రికార్డు లను వరంగల్ జిల్లా ఆపరేషన్ ఎగ్సిగూటివ్ రాజు కుమార్ పరిశీంచారు. వైద్య సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచిస్తు సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యకం చేస్తూ సిబ్బంది ఎల్లప్పుడూ విధుల పట్ల అప్రమత్తతో ఉండాలని తగు సూచనలు సలహాలు అందించారు. మరియు ప్రజలు ఈ యొక్క 108 సేవలను ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో వాహనాల సిబ్బంది ఈఎంటి బెజ్జంకి రమేష్, పైలెట్ కుమార్ పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మండల నాయకులు



**తొలి అక్షరం/గణపురం,14:** మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు రత్నం రవి రమ కుమారుడు క్రాంతి కుమార్ వెడ్స్ రిషిక వివాహా మహోత్సవానికి గురువారం హాజరై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, గణపురం మండలం మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, గణపురం గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్క సంపత్, గడ్డం సాదయ్య, ఎడ్ల సదానందం, మోరే రాజు, లదల్ల బిక్షపతి,సోమిడి దిలీప్, బొల్లి రమేష్ లు వధూవరులకు అందజేశారు.

## అనుమతి లేనిదే.. ఇంటి నిర్మాణాలు చేపట్టొద్దు

**- పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు**



**తొలి అక్షరం/నర్సింహులపేట,నవంబర్14:** అనుమతి లేనిదే ఇంటి నిర్మాణాలు చేపట్టవద్దని నర్సింహులపేట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు.గురువారం మండల కేంద్రంలో అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు నోటీసులను అందజేసినట్లు ఆయన తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు చేపట్టేవారు గ్రామపంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు.మండల కేంద్రంలో వ్యాపారం నిర్వహించే ప్రతి ఒక దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ పొందాలని,గ్రామ ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని అన్నారు.అనుమతి లేకుండా రోడ్డు ముందుకు వచ్చి నిర్మాణాలు చేపట్టే వారి నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.నిబంధన అనుసరించి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు.పలువురికి నోటీసులు కూడా అందజేశామన్నారు.కారోబార్ రమేష్,సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**తొలి అక్షరం/గణపురం:** ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.గురువారం మండలంలోని చెల్పూర్ గ్రామంలో 1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు వైద్య సేవలకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా నాణ్యమైన, మెరుగైన కార్పోరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన్నట్లు తెలిపారు. ప్రమాదాలకు గురైన వ్యక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ట్రా మా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి మూడో అంతస్థు నిర్మాణానికి 7 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు తెలిపారు. చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రయివేట్ భవనంలో ఉందని, ఈ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు శాశ్వత భవనము నిర్మించినట్లు తెలిపారు. ఆసుపత్రికి ప్రహరీ, వైద్యులు స్థానికంగా నివాసం ఉండేందుకు నివాస గృహం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దాదాపు 60 సంవత్సరాలు నుండి సేవలు అందిస్తున్నదని శాశ్వత భవనం నిర్మించుకోవడం చాలా సంతోషమని తెలిపారు. ఆసుపత్రి రహదారి కంటే ఎత్తు తక్కువ వుండటం వల్ల వర్షాకాలంలో నీళ్ళు నిలుస్తున్నాయని మేరువు చేయనున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు, తదితర మౌలిక సౌకర్యాలు కల్పనకు 1.50 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆసుపత్రిలో సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. 203 అదనపు వైద్య పోస్టింగ్ పోస్టులు జిల్లాకు మంజూరు చేపించినట్లు తెలిపారు. నర్సింగ్ భవనం, ఆయుర్వేద వైద్య సేవలకు వైద్యుల పోస్టు కూడా మంజూరు చేసి ఆయుర్వేద వైద్య సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానుట్లు తెలిపారు. చదువుకున్న వ్యక్తి ఎక్కడైనా జీవించగలడని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య సేవలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాలు నిర్మాణము పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన ఆసుపత్రిలో డ్రగ్ స్టోర్ నిర్మించామని అన్నారు. వైద్య సేవలపై బాగా ఫోకస్ చేయాలని సూచించారు. ఆశాలు క్షేత్రస్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆశాల సేవలు చాలా ముఖ్యమైనవి అన్నారు. ఏఎన్సీ రిజిస్ట్రేషన్స్ సకాలంలో చేస్తూ గర్భిణీ లకు వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఆసుపత్రి వైద్యురాలు స్వాతి, సింగిల్ విండో చైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చెయ్యడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్..




**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 14:** రైతును రాజు చెయ్యడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ అన్నారు.గురువారం మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలైన కాచికల్,రామన్న గూడెం,చిన్న నాగారం,బ్రాహ్మణ కొత్త పల్లి, పీ ఎ సిఎస్ నెల్లికుదురు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయా కేంద్రాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ,ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని రైతును రాజు చేయడమే రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యంను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం దాన్నే ప్రజా ప్రభుత్వంఅన్నారు.మండల పరిధిలో 17 వరి ధాన్యం కేంద్రాలు ఉండగా 3 ఐకెపి ,14 పి ఎ సిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు.జిల్లాలో అధిక వరి ధాన్యం పండించే మండలం నెల్లికుదురుకే దక్కుతుందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం క్వింటాకు 500 రూపాయల బోనస్,రెండు లక్షల రుణ మాఫీ ఏక కాలంలో ఇచ్చిన ఘనత దేశంలో తమ ప్రభుత్వానికే దక్కింద న్నారు. దేశానికే అన్నం పెట్టే రైతన్నలు ఉన్నారు, కాబట్టే ధాన్యగా రంగా తెలంగాణ మారుతుందని,ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవ్వరు దళారులను నమ్మి మోసపోవద్దు అని సూచించారు, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు, వాతావరణంలో జరుగుతున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు, కొనుగోలు కేంద్రాలలో ఎవరైనా మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.**మార్కెట్లో దళారి వ్యవస్థకు తావులేదు.: తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి...** ప్రభుత్వం కొనుగోలు చేసే వరి ధాన్యం కేంద్రాల్లో దళారి వ్యవస్థకు తావులేదని,అందుకే కొనుగోలు కేంద్రాలోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. రామన్న గూడెం,కాచికాల్ వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ,గతంలో జరిగినటువంటూ అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పారదర్శకంగా కొనుగోలు చెప్పట్టడం జరుగుతుందన్నారు.36 గంటలో ధాన్యం కొనుగోలు డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడం. జరుగుతుందన్నారు.నెల్లికుదురు పీఏ సిఎస్ అధ్యక్షులు కాసం లక్ష్మిచంద్ర శేఖర్ రెడ్డి గుండా వెంకన్న, అధ్యక్షతన నిర్వహించగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ కోడి చింతల రాజు,ఎంపిడిఓ బాలరాజు.మండల వ్యవసాయ అధికారి యాస్మిన్, ఎంపీఈఓ పద్మ ,ఏపీఎం వరదయ్య,సొసైటీ సిఇఓలు యాదగిరి ,కత్తుల వెంకన్న .మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాకసాయిలు,భాస్కర్ నాయక్ ,తూళ్ల నరేందర్,డిసిసి ఉపాధ్యక్షులు భూక్యా బాలాజీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్,జిల్లా బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సత్యపాల్ రెడ్డి, నాయకులు ఇట్టే దేవేందర్ రెడ్డి.పట్నం శెట్టి నాగరాజు పాశం వీరన్న,బెల్లి నర్సయ్య,మద్దెల సమ్మయ్య ,శ్రీను ,వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు , పెరుమాండ్ల మల్లేశం, మాదరి ప్రశాంత్ , దాసరి ప్రకాష్ గ్రామ అధ్యక్షులు, మాజీ సర్పంచ్లు ,ఎంపిటిసిలు ,వార్డ్ నెంబర్లు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 14:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని ఆర్డిఎఫ్ రెడ్లవాడ హైస్కూల్లో స్వర్గీయ జోహార్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రధానోపాధ్యాయులుగా, ఎంఈఓ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా వివిధ పాత్రలు పోషించి అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటపాటలను ప్రదర్శించి అంబరానంటే సంబరాల్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు సి. హెచ్. చేరాలు ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ సమాజ నిర్మాతలు భవిష్యత్ తరాల భావిభారత పౌరులు నిర్మించేటటువంటిది పాఠశాలలోనే విద్యార్థి యొక్క మూర్తి మత్వం వికసిస్తుంది అని కొనియాడారు. కాబట్టి పాఠశాలలోనే భావి భారత పౌరులు రూపుదిద్దుకుంటారని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది . అదేవిధంగా ఆర్డిఎఫ్ రెడ్ల వాడ హైస్కూల్లోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఇన్చార్జులు ,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దొంతి



**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 14:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని ముదిగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు దూదిపాల రామచందర్ కుమార్తె శిరీష-తిరుపతేష్ ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరి సాయి కృష్ణ,మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,ముదిగొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుముల శ్రీధర్ రెడ్డి, నాయకులు మట్టా బిక్షపతి,భూమాని మధు,నరసయ్య కోటి కిట్టు పాల్గొన్నారు.

## అన్నదాతల అభివృద్దే సహకార సంఘాల ధ్యేయం సహకార వారోత్సవాలలో జెండా ఆవిష్కరించిన చైర్మన్ జడ రాములు యాదవ్

**తొలి అక్షరం/ మిర్యాలగూడ,నవంబర్ 14:** అన్నదాతల అభివృద్ధి ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తాయని పిఎసిఎస్ చైర్మన్ జడ రాములు యాదవ్ అన్నారు. ఈనెల 14 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించబోయే సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలో చైర్మన్ జడ రాములు యాదవ్ సహకార సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సహకార వ్యవస్థ బలోపేతం, రైతులకు నిత్యం విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండే విధంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి సహకార సంఘం తోడ్పడుతుందన్నారు. సంఘం యొక్క సేవలను రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పొందాలన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ వల్లభ దాస్ పద్మవెంకటయ్య, డైరెక్టర్లు మాలి శంకర్ రెడ్డి, చిర్ర సాంబమూర్తి, పుట్టల లక్ ప్రకాష్, సీఈవో రవీందర్రావు, మాజీ సర్పంచి వల్లపు దాస్ యాకోబు, సిబ్బంది శేఖర్,యాదగిరి,గిరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థానాలు చేసిన ఎమ్మెల్యే నాయిని

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్14:**అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా వరంగల్



పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ 49వ డివిజన్ మైత్రి వనం కాలానిలో రూ.33లక్షలతో మరియు 52వ డివిజన్ లో రూ.31లక్షలతో మినీ బాక్స్ డ్రైన్ నిర్మాణం మరియు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను కేటగిరి గా విభజించి ప్రాధాన్యత పరంగా తెలీకపాటి వర్షాలకు సైతం నీట మునిగే కాలనీలను, డ్రైన్ ల నిర్మాణాలు చేపడుతున్నమాని ఎమ్మెల్యే తెలియజేశారు.దశల వారిగా ప్రతి కాలనీలను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులే.. ఉపాధ్యాయులైన వేళ..



**తొలి అక్షరం/నర్సింహులపేట,నవంబర్14:** మండలంలోని పెద్దనాగారం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంత ఉత్తమమైనదో పిల్లలకు తెలిసిందని అన్నారు.జిల్లా కలెక్టర్ గా సాత్విక,డీఈవోగా ఐశ్వర్య,ఎంఈఓగా దివ్య, ప్రధానోపాధ్యాయులుగా ప్రవీణ్, కొంతమంది ఉపాధ్యాయులుగా, పీఈటీలుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సికిందర్,లచ్చు, నగేష్,నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, వేణు,రాజు,మహేశ్వరి తదితరులు ఉన్నారు.

## ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



**తొలి అక్షరం/గణపురం:** మండలంలోని చెల్పూర్ గ్రామంలోని శ్రీ సాంబమూర్తి దేవాలయంలో పవిత్ర కార్తీక మాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని మామిడి అరటి తోరణాలతో అలంకరించి పార్వతీ పరమేశ్వర సత్యనారాయణ స్వామి పటాలను ప్రతిష్టించి స్వామివారికి అభిషేకం నిర్వహించి సత్యనారాయణ స్వామి వ్రతాలు నోముకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చేర్మెన్ రాందాస్ ప్రభాకర్, వైస్ చేర్మెన్ జెట్టి కనకరాజు, ధర్మకర్త లు రసమడుగు, శాంత, పొగాకు గోపి, పొనగంటి, మొగిలి, అర్చకులు హరి రఘు శర్మ, సాయి శర్మ, వ్రతంలో 108 దంపతులు పాల్గొన్నారు.

## రేపు కందికొండ జాతర జరగనున్న కందగిరిగుట్ట వద్ద పర్యటించి ఏర్పాట్లు పరిశీలించిన ప్రభుత్వవిప్



**తొలి అక్షరం/కురవి, నవంబర్ 14:** భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు...రేపు జరగబోయే కందికొండ జాతర పనులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇస్తున ఎస్పి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ, భక్తులకి ఏటువంటి ఇబ్బంది కలగకుండా ఉండాలని కందికొండ స్టేజ్ నుండి ఎంట్రీ ఉంటుందని, అయ్యగారిపల్లి నుంచి దర్శనానంతరం వెళ్లాలని భక్తులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కంధికొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు గ్రామ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## కలెక్టర్ ప్రతీక్ జైన్ దాడికి నిరసన

**తొలి అక్షరం/నరసింహుల పేట నవంబర్ 14:** చాలా సౌమ్యుడు,మంచి పరిపాలన దక్షుడు అయిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పై జరిగిన దౌర్జన్యంకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా JAC పిలుపు మేరకు గురువారంభోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు తో నిరసన తెలియజేస్తూ సంబంధింత ల పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయనైనది, భవిష్యత్తులో ఏ ఉద్యోగుల పై దౌర్జన్యం చేసినా అట్టి వారు మూల్యం చెల్లించక తప్పదు అని హెచ్చరించుచున్నాము.ఈ కార్యక్రమంలో యం.రామారావు, యంపిడిఓ, పంచాయతీ కార్యదర్శులు, సోమన్న,ఆజీం, దాసు, శ్రీకాంత్, సాగర్, ఏ పీ ఓ మాధవి, ఏపిఎం పాపయ్య, కార్యాలయ సిబ్బంది వెంకన్న,ఆదిబాబు మొదలుగు వారు పాల్గొన్నారు



## నేషనల్ హ్యూమాన్ రైడ్స్, చిల్డ్రన్స్ ఆర్గనైజర్ యాదగిరి ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుక



**తొలిఅక్షరం/చెన్నారావుపేట, నవంబర్14:** చెన్నారావు పేట మండల కేంద్రంలో కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల లో ప్రపంచ బాలల దినోత్సవన్ని పురస్కరించుకుని నేషనల్ హ్యూ మన్ రైడ్స్, చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ మైనుద్దీన్ ఆదేశాల మేరకు నర్సంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్మెట యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల స్పెషలా ఫీసర్ మెట్టుపల్లి జ్యోతి అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా మండల పరిషత్తు అభివృద్ధి అధికారిణి శ్రీవాణి విచ్చేశారు కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ.. బాలల అభివృద్ధికి లభించే నాణ్యమై న ఆహారం,ఆరోగ్యం,విద్య ,వైద్యం, వినోదం,కుటుంబ జీవనం వంటి వాటి పై ఆధార పడి ఉంటుంది అని భారదేశంలో రాజ్యగం చట్టాల ద్వారా బాలలకు ప్రత్యేక రక్షణలు కల్పించాలని అన్నారు.అనంతరం కలాం ఫౌండేషన్ చైర్మన్ భాషిమి యా మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో పిల్లలపై జరుగుతున్న పలు సంఘటనలు ఆందోళన కలిగిస్తూన్నాయి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికల విద్య అభివృద్ధికి నావంతు సహకారం అందిస్తానని తెలిపారు,హ్యూమన్ రైడ్స్, చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్మెట యాదగిరి మాట్లాడుతూ..భారత దేశం అభివృద్ధిలో దూసుకెళు _న్నప్పుడికి బాలల హక్కుల రక్షణ లోఆశించిన స్థాయిలో పురోగతి లేదు.విద్య అభివృద్ధి కి కీలకమైన విద్య హక్కు చట్టాన్ని తీసుకొచ్చినప్పటికీ ఎంతో మంది పిల్లలు విద్యకు దూరంగానే ఉన్నారుఅని అన్నారు.తరువాతా కస్తూరిభా గాంధీ పాఠశాల స్పెషల్ ఫీసర్ మెట్టుపల్లి జ్యోతి మాట్లాడు తూ..బాలల దినోత్సవం పురస్క రించుకుని నెహ్రూ నేటి బాలలలే రేపటి భావితరాలకు పునాదులు అని అన్నారుఅని బాలల యొక్క హక్కులు,ట్టాలపై అవగాహన కల్గి ఉండాలి అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో మంది విద్యార్థులు విద్యాంభ్యసిస్తున్నారు పేదరికాన్ని పక్కన పెట్టి విద్యలో ముందంజలో ఉన్నారు పేద విద్యార్థుల ప్రభుత్వ పాటశాలల్లో చేర్పించి విద్యార్థుల భవిష్యత్తు కు పునాదుల వేయాలని అన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కలాం ఫౌండేషన్ ఉపాధ్యక్షులు అశోక్, ఉపాధ్యాయిలు పల్లవి, రాజ్యలక్ష్మి, యశోద, తేజస్విని రజిని సుజాత,కవిత,పిఈటిలు,నరసింహస్వామి,మంజుల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం..

- అలరించిన చిన్నారుల వేషధారణ..





**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 14:** నెల్లికుదురు మండలం నర్సింహులు గూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ నిర్వహించారు.గురువారం చాచా నెహ్రూ జన్మ దినం సందర్భంగా ఎంపీ యుపీఏస్ నర్సింహుల గూడెం పాఠశాలలో బాలల దినోత్సవ కార్రృమం ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాలకు గ్రీన్ బోర్డు బహుకరించిన దాతలను సన్మానించారు . అనంతరం హెచ్ ఎం పద్మావతి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యా భ్యాసం ద్వారా భవిష్యత్ ఉజ్వలంగా వుండి అభివృద్ధి పథంలో నడుస్తారని అన్నారు. పాఠశాలకు గ్రీన్ బోర్టులు బహుకరించిన దాతల సి హే.వెంకటేశ్వర్లు, బి. ఉప్పలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే నాణ్య మైన విద్యా అందుతుంది అని, పాఠశాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. నిర్వహించిన కార్యక్రమం లోని విద్యార్థులు వివిధ వేషదారణలో భరతమాత, సంస్వతి, నెహ్రు, క్రిష్ణుడు రుద్ర మ దేవి, గోపిక మద్రలు, ఇందిరా గాంధీల వేషధారణ వేసి పలువురిని అభినందించారు.ఉపాధ్యాయులు హరినాధ్ బాబు, శ్రీనివాస్,సుకన్య, రమేష్, సంగ శ్రీనివాస్, ఎస్కే,సయ్యద్, ఎ,మమత పాల్గొన్నారు.

## అరవింద పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

- ఉపాధ్యాయ విద్యార్థులతో కరస్పాండెంట్ పంచకం నర్సయ్య



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్14:** బాలల దినోత్సవం (జవహర్ లాల్ నెహ్రూ జయంతి) సందర్భంగా నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గా ఇత్రత్ ఆనమ్ ఫాతిమ, ఇంచార్జి ప్రిన్సిపాల్ గా ఎస్ సుధీర్, పీఈటి గా బి లోకేష్, 17 మంది విద్యార్థులు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.అనంతరం ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారి అనుభవాలను అందరితో పంచుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉపాధ్యాయులు ఎంత ఓపికతో బోధిస్తున్నారో అర్థమయిందని, వారు చెప్పే విషయాలను తూచా తప్పకుండా పాటించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటామని తెలిపారు. అలాగే వారు ఎంచుకున్న లక్ష్యాలను తెలియజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో, సమాజంలో ఎలా వ్యవహరించాలో స్వయంగా వారే తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు. ఉపాధ్యాయులు ఎంత కష్టపడి పాఠాలు బోధిస్తున్నారో అర్థం చేసుకుని శ్రద్ధగా చదివి మీరు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. అనంతరం చక్కగా తమ విధులను నిర్వర్తించిన ఉపాధ్యాయ విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాళ్లు కె అశ్విని, ఎ నర్మద,కె.దివ్య శ్రీ,యాస్మీన్,జె.స్వప్న, కె.రజిత, ఆఫ్రీన్,సిమ్రాన్,ఎ.సుష్మిత,హెచ్ స్పందన, విద్యార్థినీ విద్యార్థులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవ సందర్భంగా క్రీడా సామాగ్రి పంపిణీ

- చేసిన మాజీ పి.ఎ.సి.ఎస్ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి
- తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా క్రీడా వస్తువుల బౌహుకరణ






**తొలిఅక్షరం/చెన్నారావుపేట, నవంబర్ 14:** మండల కేంద్రంలోని తిమ్మరాయిని పహాడ్ స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తొగరు విజయా, గోవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుమారుడు చెన్నారావుపేట పి.ఎ.సిఎ.స్ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి ఆర్థిక సహాయకారంతో మంద నరేష్ ఆద్వర్యంలో పాఠశాలకు కావలసిన ఆట వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగోతు శౌరీలు మాట్లాడుతూ..పాఠశాల బలోపేతానికి తన వంతు సహకారాన్ని అందించి పేద మధ్య తరగతి పిల్లల అభ్యున్నతికి సహకారాలని అందిస్తున్న తొగరు చెన్నారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అంతేకాకుండా ఈ మధ్య కాలంలో డివిజన్ మరియు జిల్లా స్థాయిలో క్రీడా విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందని తద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల పట్ల తనకున్న శ్రద్ధ మరియు ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తూ ఉన్నారని కొనియాడారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మమత,కొమ్ముల కిరణ్, మినుముల నరేష్,మొలుగూరి బాను,మహమ్మద్ రజాక్,మోతే ఈశ్వర్ గ్రామ యువకులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి...

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్‌కు వినతి పత్రం ఆందజేత..
- సిపిఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు..




**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 14:** మండలంలో నెలకొన్న పలు సమస్యలపై మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ కు ప్రజా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల సిపిఎం పార్టీ కార్యదర్శి ఇసంపల్లి సైదులు అందజేశారు. గురువారం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభోత్సవాలకు వచ్చిన సందర్భంగా మునగల వీడు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వినతి పత్రాన్ని ఎమ్మెల్యే కు అందజేశారు.అనంతరం సైదులు విలేఖర్లతో మాట్లాడుతూ నెల్లికుదురు మండల కేంద్రంలో గల పీహెచ్ సి లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,మండల కేంద్రంలో గల 317, 34 , సర్వే నెంబర్ లో గల ప్రభుత్వ భూమిని దళారుల నుండి కాపాడే ఇంటి స్థలం లేని నిరుపేదలకు పంచాలిని మునిగలవేడు శివారు నుండి పోయే కెనాల్ కాలువ నుండి మామిడికుంట చెరువుకు కాల్వ ఏర్పాటు చేసి నీరు అందించాలని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన ఇండ్లకు ఇందిరమ్మ ఇండ్ల ఇచ్చి పేదలను ఆదుకోవాలనికోరారు. ఇటీవల వర్షాలకు తెగిపోయిన చెరువులకు గుంటలకు తక్షణమే మరమ్మత్తులు చేయించి యాసంగికి పంటకు రైతులకు నీరు అందించాలని,నైనాల చెరువు కట్టకు ఇరువైపుల గల సర్కార్ చెట్ల పొదలను తొలగించి రైతులను ఆదుకోవాలి తొర్రూరు నుండి కేసముద్రం టి ఎస్ ఆర్ టి సి బస్సును పునరుద్ధరించాలని వెంటనే అర్హులైన రైతులకు రైతు భరోసా, రుణమాఫీ చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల బాబుగౌడ్ బాణాల యాకన్న ఇసంపల్లి వెంకటయ్య కృష్ణమూర్తి, నర్సయ్య ,తోట యాకయ్య, బోడ హాలియా ఈరియా శ్రీనివాస్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## అంగవైకల్యం కలిగిన చిన్నారులను చేరదీయడంలో అందరూ భాగస్వామ్యం కావాలి

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్14:** అంగవైకల్యం కలిగిన చిన్నారులను చేరదీయడం వారికి చేయూత అందించడంలో అందరూ భాగస్వామ్యం కావాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.బాలలదినోత్సవం సందర్బంగా హనుమకొండలోని స్పందన వికలాంగులు బధిరుల కేంద్రంలో అనితరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చేతులమీదుగా పుస్తకాలను పంపిణీ చేశారు. బాలలదినోత్సవం పురస్కరించుకొని స్పందన కేంద్రంలో జీవితంతో పోరాటం చేస్తున్న ఇలాంటి చిన్నాల మధ్య జరుపుకోవడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని నేటితరం పిల్లలకి పరిమిత స్వేచ్ఛను కల్పించాలని,పిల్లలకు చేరుకోవాల్సిన లక్ష్యసాధన దిశగా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని, అంగవైకల్యం అనేది దేహానికి మాత్రమేనని వారి మనసుకు వారి బుద్ధికి కాదని అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్ యాదవ్, స్పందన కేంద్ర ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గిరిజనుల జోలికొస్తే... ప్రభుత్వ పతనం తప్పదు


- గోర్ సేన రాష్ట్ర అధ్యక్షులు భానోత్ కిరణ్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్14:** గిరిజనుల జోలికొస్తే రాష్ట్ర ప్రభుత్వం పతనం తప్పదని గోర్ సేన రాష్ట్ర అధ్యక్షులు భానోత్ కిరణ్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల లో గిరిజనులను జైలు పాలు చేయడం తనను ఎంతో కలిచి వేసిందని, అలాగే అధికారుల పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని కచ్చితంగా వారికి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని అలాగే అమాయక గిరిజన గోర్ బంజారా బిడ్డలనూ రాష్ట్ర ప్రభుత్వము, పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అమాయకులను తీసుకెళ్లి జైలు పాలు చేయడం, తండలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదని అన్నారు. గిరిజన బిడ్డల్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం మంచిది కాదని అధికార , ప్రతి పక్ష పార్టీలకు సూచించారు. గిరిజన భూములను లాక్కొని ఫార్మా కంపెనీని ఏర్పాటు చేయాలనే మూర?పు ఆలోచనలు వెంటనే ఉపరించు కోవాలన్నారు. అల్లర్ల లో అరెస్టు అయిన బంజారా బిడ్డలను బేషరతుగా విడుదల చేయాలని ఆయన కోరారు.



## ఆగిన అభివృద్ధి కొనసాగించే బాధ్యత నాదే

- ఎన్నో ఏళ్ల కళగా ఉన్న, కాజిపేట బ్రిడ్జి పనులకు శ్రీకారం
- మార్చి మాసం నాటికి కాజీపేట బ్రిడ్జి నిర్మాణం పూర్తి



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్14:** ఇచ్చిన ప్రతి హామీలను నెరవేర్చే బాధ్యత మాదని, ఎన్నో ఏళ్ల కలగా మిగిలిపోయిన కాజీపేట బ్రిడ్జి పనులకు పునర్నిర్మాణం చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గురువారం వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి బ్రిడ్జి నిర్మాణం కోసం వచ్చిన మెటీరియల్ పరిశీలించారు.గత ప్రభుత్వ పాల కుల ఒంటెద్దు పోకడలతో కాజిపేట్ బ్రిడ్జి నిర్మాణా పనులను ఆపిన కూడా ఎమ్మెల్యేగా గెలిచినా తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను ఒప్పించి తక్షణమే నిధులను విడుదల చేయించడం జరిగింది. తద్వారా రైల్వే ట్రాక్ పై నిర్మాణం కోసం ఛత్తీస్గడ్ రాష్ట్రంలో ప్రత్యేకంగా తయారు చేస్తున్న మెటీరియల్ చేరుకుందని అన్నారు.మెటీరియల్ మొత్తం రాగానే బ్రిడ్జ్ నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నదని, అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు.అధికారులతో కలిసి బ్రిడ్జి స్లాబ్ నమూనా,రైల్వేట్రాక్ పై నిర్మించే పనులను మ్యాపింగ్ ద్వారా పరిశీలన చేశారు.

## జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ప్రారభించిన ఎమ్మెల్యే నాయిని

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్14:** 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను గురువారం రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. హనుమకొండలోని జిల్లా గ్రంధాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వాలన్ చేసి కార్యక్రమాన్ని ప్రారభించారు.దాదాపు వారం రోజుల పాటు సాగె వారోత్సవల్లో గ్రంధాలయ పటాకులు పాల్గొనలని, యాజమాన్యం నిర్వహించే వివిధ క్రీడా పోటీలలో పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే నాయిని పిలుపునిచ్చారు. గతంలో రాజకీయ ప్రస్థానంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా పదవి చేపట్టానని నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో 20రూపాయలు ఉన్న ఇంటర్నేట్ సేవాలను కేవలం 5 రూపాయలకే ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. హనుమకొండ జిల్లా గ్రంధాలయాల్లో చదువుకొని ఉన్నత స్థాయి లో నిలిచినా పూర్వ విద్యార్థులు గ్రంధాలయ అభివృద్ధికి ముందు కు రావాలని ఎమ్మెల్యే నాయిని పిలుపునిచ్చారు.వారం రోజుల్లో నూతన చైర్మన్ నియామకం జరగనున్నదని, అన్ని విధాలుగా గ్రంధాలయాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. గ్రంధాలయం సిబ్బందికి వేతనాల జాప్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లానని త్వరలో శాశ్వత పరిష్కరం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారని ఎమ్మెల్యే అన్నారు.అంతకు ముందు నయిం నగర్ (పోలీస్ హెడ్ క్వార్టర్ ఎదురుగా ) లో నూతనంగా ఏర్పాటు చెసిన విజన్ మేకర్స్ (ఆప్టికల్ ) ని ప్రారంభించారు.

